# బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి

**మంత్రి వాకిటి శ్రీహరికి వినతి**



**నేటి సాక్షి,నారాయణపేట( ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా గుడిగండ్ల గ్రామం నుండి మంత్రోనిపల్లి వరకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరిని గ్రామస్థులు కలిశారు. ఈ సందర్భంగా గుడిగండ్ల, మంత్రంపల్లి గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, స్థానిక నాయకులు రోడ్డు నిర్మాణ అవశ్యకతను మంత్రికి వివరించి, లిఖితపూర్వక వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఉన్న రహదారి అధ్వాన్నంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని వారు పేర్కొన్నారు. బీటీ రోడ్డు నిర్మిస్తే రెండు గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, నిధుల మంజూరుకు మరియు రహదారి నిర్మాణానికి తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడిగండ్ల, మంత్రంపల్లి మండల నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి

**ఏడుగురు అరెస్ట్**



**నేటి సాక్షి,నారాయణపేట( ఇమామ్ సాబ్):** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మన్‌పాడు గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 4,330 నగదుతో పాటు, 4 సెల్ ఫోన్లు మరియు 2 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ రెడ్డి తెలిపారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 1.95 కోట్లతో అభివృద్ధి పనులు

**రాష్ట్ర పంచాయితీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య**



**నేటిసాక్షి,ములుగు:** తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో మండలంలోని పలు గ్రామాలలో స్పెషల్ గ్రాంట్ కింది అభివృద్ధి పనులకు రూ 1.95 కొట్ల నిధులు మంజూరీ అయినట్టు రాష్ట్ర పంచాయితీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు గతంలో సీఆర్ఆర్ నిధులకింద మండలంలో సుమారు 5 కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. అదే విధంగా రెండవ విడతగా గురువారం 1.95 రూపాయల కోట్లతో మరిన్ని సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాని మంత్రి సీతక్క నిధులను మంజారు చేసినట్టు తెలిపారు మండలంలోని బుచ్చంపేటకు రూ 35 లక్షలు చెరుపల్లికి 45 లక్షలు,తిమ్మంపేటకు 70 లక్షలు కొత్త మల్లూరుకు 15 లక్షలు అక్కినపల్లి మల్లారానికి 30 లక్షలు మొత్తం 1 కోటి తొంబై అయిదు లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజారీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కకు ప్రభుత్వ పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వాల 10 సంవత్సరాల కాలంలో ఒక్క గ్రామంలో సీసీ రోడ్లు పోసిన దాఖలాలు లేవని ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన అనంతరం అన్ని గ్రామాలు అభివృద్ధిలో ముందుకు దూసుకు పోతున్నాయని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు గుమ్మడి సోమయ్య తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



**నేటి సాక్షి,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా. చిలుకూరు మండలం నారాయణపురం బడిబాటల కార్యక్రమంలో మాట్లాడుతున్న గుజ్జుల నరసింహారెడ్డి. . ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ గుజ్జుల నరసింహారెడ్డి అన్నారు గురువారం మండలంలోని నారాయణపురం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పుస్తకాలు అందించడంతోపాటు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

# దేవులవాడలో పోలీస్ తనిఖీలు



- **37 వాహనాలు సీజ్**
  **గురువారం తెల్లవారుజామున ఆకస్మికంగా 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం' నిర్వహణ**
- **2000 లీటర్ల బెల్లపు పానకం ధ్వంసం.. ఏడుగురిపై కేసులు నమోదు**

**నేటి సాక్షి,మంచిర్యాల:** నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి భాస్కర్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవులవాడ గ్రామంలో 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం' నిర్వహించారు. సుమారు 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని సోదాలు చేసి, సరైన ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు మరియు 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశమని ఏసిపి తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గుడుంబా ప్రభావిత ప్రాంతాలపై నిర్వహించిన మెరుపు దాడుల్లో సుమారు 2000 లీటర్ల బెల్లపు పానకాన్ని ధ్వంసం చేశామని, 70 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పుకోవచ్చని సూచించారు. ఏదైనా ఆపద కలిగితే వెంటనే 'డయల్ 100'కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, రూరల్ సీఐ కృష్ణ, ఎస్సైలు సుబ్బారావు, రాజశేఖర్, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భావసంగ్ బావా ఆలయ భూములపై సురేందర్ రెడ్డితో లంబాడీ ఐక్య వేదిక భేటీ



- **దేవాలయ అస్తిత్వం, భూముల దానంపై హైదరాబాద్ నివాసంలో కీలక చర్చ**
- **సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి హామీ**

**నేటి సాక్షి,మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని మాకుల క్షేత్రం భావసంగ్ బావా - మ్యారామ భవానీ దేవాలయ భూములు, లంబాడీ సమాజ అస్తిత్వానికి సంబంధించిన అంశాలపై లంబాడీ ఐక్య వేదిక ప్రతినిధులు గురువారం కీలక అడుగు వేశారు. లంబాడీల ఆచార వ్యవహారాలను, అస్తిత్వాన్ని విస్మరిస్తున్న అంశాలను చర్చించేందుకు రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ప్రతినిధులు హైదరాబాద్‌లోని మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే రామసహాయం సురేందర్ రెడ్డి నివాసంలో వారిని కలిశారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్ ఈ భేటీకి మధ్యవర్తిత్వం వహించారు.

**ఆధ్యాత్మిక బంధం - భూముల దానం:**

సమావేశంలో సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబానికి చెందిన మామిడి తోటలో భావసంగ్ మహారాజ్ అన్నదమ్ములు, మాకుల తండా పెద్దల సహకారంతో ఆలయ స్థాపన జరిగిందని గుర్తుచేశారు. ఆలయ నిర్వహణ, ధూప దీప నైవేద్యాల కోసం తమ కుటుంబం దాదాపు 2 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. లంబాడీలతో తమకు చిన్ననాటి నుంచి విడదీయరాని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని, అందరి మనోభావాలను గౌరవిస్తూ సమస్యకు శాంతియుత పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**వారసత్వాన్ని కాపాడుకుంటాం:**

భావసంగ్ బావా వారసత్వాన్ని ఎవరూ దూరం చేయలేరని మాలోత్ నెహ్రూ నాయక్ స్పష్టం చేయడం పట్ల ఐక్య వేదిక ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్య వేదిక ఉద్యోగ విభాగ రాష్ట్ర కార్యదర్శి ధారావత్ రమేష్ నాయక్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఇస్లావత్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మజీద్‌పల్లిలో ఈత చెట్ల తొలగింపు గౌడ సంఘం ఆగ్రహం





- **300 ఈత చెట్లను నరికివేయడంపై గీత కార్మికుల నిరసన**
- **బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నపం**

**నేటి సాక్షి,గజ్వేల్:** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఉన్న సుమారు 300 ఈత చెట్లను అనధికారికంగా తొలగించిన ఘటనపై గౌడ సంఘం సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయ పరిసరాల్లోని 51, 56 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిలో గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన ఈత వనాన్ని, తమకు ఎలాంటి సమాచారం లేకుండా తొలగించడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. 15 ఏళ్లుగా సంరక్షించుకుంటున్న ఈ వనం గీత కార్మికులకు ప్రధాన జీవనాధారమని, దీనిని ధ్వంసం చేయడం వల్ల తమ ఉపాధి దెబ్బతిన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ.. గీత కార్మికుల పొట్ట కొట్టేలా ఈత చెట్లను నరికివేసిన వారిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేయాలని, తొలగించిన చెట్ల స్థానంలో మళ్లీ కొత్తగా ఈత మొక్కలు నాటి గీత వృత్తిని కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూమిలో ఉన్న వృక్ష సంపదను ధ్వంసం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాజపేట స్వామి గౌడ్, నరేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ మరియు గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలి

**సీఎస్ రామకృష్ణ**

**నేటి సాక్షి,వికారాబాద్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రతా వారోత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. గురువారం డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు మరియు వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. జిల్లాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి, ప్రజల్లో అవగాహన కల్పించేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ప్రధాన కూడళ్ల వద్ద హెల్మెట్ వాడకం, సీట్ బెల్ట్ ధరించడంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, బైక్ ర్యాలీలు చేపట్టి వాహనదారులకు అవగాహన కల్పించాలని సీఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను సంయుక్తంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైవర్ల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్పీ సీఈఓ సుధీర్, రవాణా అధికారి వెంకట్ రెడ్డి, డీఈఓ రేణుకా దేవి మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## హత్య కేసులో నిందితుల అరెస్ట్



**నేటి సాక్షి, చౌడేపల్లి:** బోయకొండ అడవిలో ఇటీవల జరిగిన గాంధీ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన గాంధీ, తన భార్య రసాధితో కలిసి చౌడేపల్లి మండలం ఊటూరు సమీపంలోని కోళ్ల ఫారంలో పనిచేసేవారు. ఈ క్రమంలో బోయకొండకు చెందిన నర్సింహులుతో రసాధికి పరిచయం ఏర్పడి, ఆమె భర్తను వదిలి అతనితో వెళ్ళిపోయింది. పది రోజుల క్రితం గాంధీ బోయకొండకు వచ్చి తన భార్యను తిరిగి రమ్మని వేధించడంతో, నర్సింహులు, అతని తమ్ముళ్లు లక్ష్మీపతి, నాగరాజు మరియు రసాధి కలిసి పథకం ప్రకారం గాంధీని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 5వ తేదీ రాత్రి గాంధీని అడవిలోకి తీసుకెళ్లి మద్యం తాపించి, రాళ్లతో, కట్టెలతో కొట్టి చంపి పరారయ్యారు. గాంధీ తమ్ముడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, గురువారం ఉదయం నిమ్మనపల్లి రోడ్డు వద్ద నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. హత్య జరిగిన నాలుగు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.

## ఆర్కే వ్యాఖ్యలు దుర్మార్గం

**పాములపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



**నేటి సాక్షి,పాములపాడు:** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ మహిళలపై చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రాధాకృష్ణపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్సై తిరుపాలకు ఫిర్యాదు చేశారు. మచ్చ వెంకటేష్, శ్రీనివాసులు, శివలింగం, యుగంధర్ రెడ్డి తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలకు ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాధాకృష్ణ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. మహిళలపై కనీస గౌరవం లేకుండా మాట్లాడటం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. మహిళల మనోభావాలను దెబ్బతీసిన రాధాకృష్ణ వెంటనే రాష్ట్రంలోని మహిళలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు దర్గయ్య, రాజు, మల్లికార్జున మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో 'ఉద్యోగ మిత్ర'

**'సురక్ష నేత్ర'పై అవగాహన**



**నేటి సాక్షి,గజ్వేల్ :** గజ్వేల్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, పట్టణ భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర' కార్యక్రమం గురించి ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా సుమారు 100కు పైగా ప్రముఖ కంపెనీల్లో 1500కి పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కౌన్సిలర్లు ప్రోత్సహించాలని కోరారు. అలాగే పట్టణ భద్రత, నేరాల నియంత్రణ కోసం 'సిద్దిపేట సురక్ష నేత్ర' ప్రాముఖ్యతను ఇన్‌స్పెక్టర్ నొక్కిచెప్పారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరస్తులను గుర్తించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లు, కాలనీల్లో దాతల సహకారంతో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ శాఖ చేపడుతున్న ఈ వినూత్న కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ చందన, వైస్ చైర్మన్ పద్మా బాయ్ కళ్యాణ్కార్ నర్సింగారావు మరియు కౌన్సిలర్లు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలి





- ప్రొఫెసర్ పురుషోత్తం

**నేటి సాక్షి,మిర్యాలగూడ :** నేటి తరం విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాల్సిన గురుతర బాధ్యత అధ్యాపకులపైనే ఉందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని కేవీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'బేసిక్ స్టాటిస్టిక్స్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఎకనామిక్స్' అనే అంశంపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలను నిర్మించే ఉపాధ్యాయులు ఇటువంటి శిక్షణా తరగతుల ద్వారా సబ్జెక్టుపై పట్టు సాధించాలని కోరారు. ముఖ్యంగా అర్థశాస్త్రంలో గణాంకాలు (స్టాటిస్టిక్స్) వంటి కఠినమైన అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విద్యా సంస్కరణలకు అనుగుణంగా అధ్యాపకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన 'నేటి నిజం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ భీమర్జున రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల చేపడుతున్న పరిశోధనా కార్యక్రమాలకు ఉన్నత విద్యా మండలి సహకారం అందించాలని కోరారు. గెస్ట్ ఆఫ్ హానర్ గా విచ్చేసిన ప్రొఫెసర్ సుజిత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి కళాశాలల్లో ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎస్‌డీ నిర్వహించే ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలకు ఈ కళాశాల విద్యార్థులను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ జి. రామకృష్ణ మాట్లాడుతూ.. ఎకనామిక్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర పెరుగుతోందని, అధ్యాపకులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మడి నరేష్, వివిధ కళాశాలల నుండి వచ్చిన 16 మంది అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఐకెపి కేంద్రాలను రద్దు చేయాలి



- బీఎస్పీ నాయకుడు కత్తుల కాన్షీరామ్

**నేటి సాక్షి,నల్లగొండ:** భువనగిరి పార్లమెంటు పరిధిలోని ప్రైవేటు ఐకెపి కేంద్రాల్లో రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, తక్షణమే ఆ కేంద్రాలను రద్దు చేయాలని బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ ఐకెపి సెంటర్లు, హమాలీ కాంట్రాక్టర్ వ్యవస్థలు కలిసి రైతులను బహిరంగంగా వంచిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు ఏమాత్రం న్యాయం చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. ఒక బస్తా 40 కిలోలు ఉండాల్సి ఉండగా, 'ఒడ్డు' పేరుతో అదనంగా 800 గ్రాములు తీసుకోవడం దారుణమని, మొత్తం 40 కిలోల 850 గ్రాముల తూకం వేస్తూ రైతును నిలువునా ముంచుతున్నారని విమర్శించారు. ఐకెపి కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, సరిపడా గన్నీ బ్యాగులు వంటి కనీస సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధరను రూ. 5,000గా నిర్ణయించాలని, హమాలీ కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని కాన్షీరామ్ డిమాండ్ చేశారు. తూకం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి





**నేటి సాక్షి,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం చిలుకూరు మరియు కొండాపురం గ్రామాల్లో రైతులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ (IKP) సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ధ్రువ కుమార్, ఎంపీడీఓ ముక్కపాటి నరసింహారావు కోరారు. గురువారం కొండాపురం గ్రామంలో సంఘం బంధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు కల్పించే ఈ వెసులుబాటును ఉపయోగించుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొల్లు పుల్లమ్మ నాగయ్య, బాబు, మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీధర్, ఏఈఓ శిరీష, ఏపీఎం వీరబాబు పాల్గొన్నారు. అలాగే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ) మంత్రిప్రగడ సీతారామచంద్రరావు, శ్వేత, గ్రామ కార్యదర్శులు షరుపుద్దిన్, కార్తీక్ రెడ్డి, సంఘం బంధం సభ్యులు, కేంద్రాల నిర్వాహకులు, రైతులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అర్హులందరికీ ఉపాధి హామీ


- సర్పంచ్ వేమూరి సత్యనారాయణ
- నర్సింహపురంలో ఉపాధి హామీ పథకంపై అవగాహన సదస్సు
- గ్రామీణ పేదల ఆర్థిక భద్రతకు పథకం ఒక వరమని వెల్లడి



**నేటి సాక్షి,మునగాల:** గ్రామీణ పేదల ఆర్థిక భద్రతకు ఉపాధి హామీ పథకం ఒక వరం వంటిదని మునగాల మండల పరిధిలోని నర్సింహపురం గ్రామ సర్పంచ్ డా. వేమూరి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉపాధి హామీ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు నమోదు చేసుకుని ఉపాధి హక్కును పొందాలని పిలుపునిచ్చారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల పని దినాలు కల్పించబడతాయని, రోజుకు రూ. 307 చొప్పున వేతనం అందుతుందని సర్పంచ్ వివరించారు. ముఖ్యంగా చెరువుల పూడికతీత, రహదారుల మరమ్మతులు, వృక్షారోపణ వంటి పనుల ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడటంతో పాటు స్థానికంగానే ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల గ్రామాల నుండి పట్టణాలకు వలసలు తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు కూడా ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పాల్గొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. పనుల వద్ద కూలీలు సమయపాలన పాటించాలని, అధికారుల సూచనల మేరకు నాణ్యమైన పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్య, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేటలో రేషన్ బియ్యం అక్రమ దందా

- మూడు నెలల కోటా ఒక్కసారిగా పంపిణీ.. బ్లాక్ మార్కెట్‌కు భారీగా మళ్లింపు
- డీలర్ల లీకులు, అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం




**నేటి సాక్షి,సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా రోజురోజుకీ విస్తరిస్తూ సంచలనంగా మారుతోంది. ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒక్కసారిగా పంపిణీ చేస్తుండగా, ఒక్కొక్కరికి 18 కేజీల చొప్పున బియ్యం అందుతోంది. అయితే ఈ బియ్యం పేదల గిన్నెల్లో పడకముందే మధ్యవర్తుల ద్వారా బ్లాక్ మార్కెట్‌కు మళ్లిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## రహస్యంగా రవాణా.. డీలర్ల సహకారం?

గ్రామాల్లో పేదలకు అందాల్సిన బియ్యాన్ని కిలో రూ. 20 నుంచి రూ. 24 వరకు కొనుగోలు చేస్తూ, మధ్యవర్తులు ఆటోలలో రహస్యంగా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాకు కొందరు డీలర్లే అండగా నిలుస్తున్నారని, తనిఖీలు ఎప్పుడు జరుగుతాయో ముందుగానే లీక్ చేస్తూ దందా నిర్వాహకులకు సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

## అర్హత లేని కార్డుల వల్లే సమస్య:

పట్టణాలు మరియు గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న కొందరు అర్హత లేని వ్యక్తులు కూడా రేషన్ కార్డులు సంపాదించి బియ్యం తీసుకుంటున్నారని, వారికి ఆ బియ్యం అవసరం లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తున్నారని సమాచారం. కొందరు ప్రభావిత వ్యక్తులు, ముసుగు దొంగల అండతో ఈ అక్రమ రవాణా నిరాటంకంగా సాగుతోంది. ఈ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదల బియ్యం దారి మళ్లకుండా వెంటనే కట్టడి చేయాలని, అర్హత లేని వారి కార్డులను రద్దు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బీసీ ధర్మ దీక్షకు మద్దతుగా రెండో రోజు రిలే నిరాహార దీక్ష




**నేటి సాక్షి,పుంగనూరు :** పుంగనూరు పట్టణంలోని ముడెప్ప సర్కిల్ వద్ద గురువారం బీసీవై పార్టీ నాయకులు బీసీ ధర్మ దీక్షకు మద్దతుగా రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఏప్రిల్ 11న చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐదు ప్రధాన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. బీసీ రక్షణ చట్టం అమలు, రాజధాని ప్రాంతంలో బీసీలకు 1000 ఎకరాల భూమి కేటాయింపు, కార్పొరేషన్లకు నిధుల విడుదల, సమగ్ర కుల గణనతో పాటు చట్టసభలు మరియు ఉద్యోగాల్లో 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నాయకులు స్పష్టం చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో ఏప్రిల్ 11న జరిగే ఆమరణ నిరాహార దీక్షలో బీసీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు పాల రమేష్ యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ హరి బాబు యాదవ్, అన్నమయ్య జిల్లా యూత్ కో-కన్వీనర్ ఉత్తన్న, సాంబ మూర్తి, గిరిబాబు కుమ్మర, వెంకటేష్ యాదవ్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు మేలు జరిగేలా ధాన్యం కొనుగోలు చేపట్టాలి



- జిల్లాలో 281 కేంద్రాల ఏర్పాటు.. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెల్లడి
- ఎర్కారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**నేటి సాక్షి, సూర్యాపేట :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు పూర్తిస్థాయిలో మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సూర్యాపేట రూరల్ మండలం ఎర్కారం గ్రామంలో పీఏసీఎస్ (రాజు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 281 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. కేంద్రాల్లో వేయింగ్ మిషన్లు, మాయిశ్చర్ మీటర్లు, తాగునీరు, టెంట్లు మరియు అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు టార్పాలిన్ పట్టాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో కూడా ప్రత్యేక కమిటీలు నిరంతరం పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. రవాణాలో జాప్యం లేకుండా ప్రతి 2-3 మండలాలకు ఒక ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను కేటాయించినట్లు చెప్పారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం వచ్చిన 2-3 రోజుల్లోనే కాంటాలు పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పీఏసీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్ బాబు, శ్రీధర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి ప్రవీణ్, పీఏసీఎస్ సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలు



**నేటి సాక్షి తొగుట,(వడ్డే నరసింహులు):** తొగుట మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మండలానికి సంబంధించిన 10 మంది రైతులకు సబ్సిడీపై 13 లక్షల 727 రూపాయల విలువైన 10 రోటవేటర్ లు లిఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ (అమర్) రెడ్డిలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్ల పై ఎటువంటి సబ్సిడీలు ఇవ్వలేదన్నారు.

ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతనే రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామని అన్నారు. ఈ రోజు మన దుబ్బాక నియోజకవర్గానికి 54లక్షల రూపాయల వ్యవసాయ సబ్సిడీ పనిముట్లు వచ్చాయని వచ్చే ఆర్థిక సంవత్సరంలో మండలానికి 50 లక్షల రూపాయల వ్యవసాయ సబ్సిడీ పనిముట్లు వస్తాయని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చూా మోహన్, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మార్కెట్ వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు, సర్పంచ్ లు పాగాల శోభ కొండల్ రెడ్డి,గొడుగు జయమ్మ నర్సింలు, డైరెక్టర్ లు చందా సత్తయ్య ,జిడిపల్లి స్వామి, నరసింహారెడ్డి, అన్సర్,బుచ్చ గౌడ్,నాయకులు మహిపాల్ రెడ్డి, మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి, రజినీకాంత్ రెడ్డి,భాస్కర్ రెడ్డి, భరత్,కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

## ప్రారంభించిన సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** టిఆర్ఈఎస్ఏ యూనియన్, మిర్యాలగూడ డివిజన్ వారి ఆధ్వర్యంలో గురువారం సబ్-కలెక్టర్ కార్యాలయం గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సబ్-కలెక్టర్ అమిత్ నారాయణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ ఈఎస్ఏ డివిజన్ అధ్యక్షులు హేమలత, మరియు కార్యవర్గ సభ్యులు, నాయబ్ తహసీల్దార్ చాంద్ పాషా మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల పరామర్శ



**నేటిసాక్షి,ములుగు:** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామలో బిఆర్ఎస్ పార్టీ మండలం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కుదురుపాక చిట్టీ బాబు కుమారుడు జస్వంత్ ఇటీవల బైక్ యాక్సిడెంట్ అయి తలకు తీవ్రమైన గాయాలు తగలాగా విషయం తెలుసు కున్న శ్రీరామ కృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్ వారి ఇంటికి వెళ్లి అబ్బాయి ని పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు అలాగే మల్లూరు గ్రామం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పూజారి శ్రీనివాస్ కు కాలుకి దెబ్బ తగిలి ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్దా రాగ శ్రీనివాస్ ఇంటికి నాగారమేష్ వెళ్లి పరమర్శించి ఓదార్చారు ఈ కార్యక్రమం లో మల్లూరు గ్రామ అధ్యక్షులు సోయం ఈశ్వర్ మల్లూరు టెంపుల్ మాజీ చైర్మన్ ముకుందం సంతోష్ బడిశా నవీన్ గోపి శ్యాం ప్రసాద్ సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.

# న్యాయవాది శ్రీనివాసరాజుకు సన్మానం



**నేటి సాక్షి,పుంగనూరు:** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన ఉప్పలపాటి శ్రీనివాసరాజును పుంగనూరు బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కోర్టు ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమం కోసం హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేలా ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ వేదికగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పుంగనూరు న్యాయస్థానంలో జడ్జిల నియామకానికి సంబంధించి త్వరలోనే హైకోర్టు బార్‌లో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మంచాల విజయ్ కుమార్, కార్యదర్శి అరవింద కుమార్, ఉపాధ్యక్షులు గురుమూర్తితో పాటు న్యాయవాదులు బాలాజీ, కుమార్, శైలేంద్ర కుమార్, శివప్ప నాయుడు, ఎల్వీ రమణ, వీర మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు మొబైల్ పంపిణీ



**నేటి సాక్షి,నారాయణపేట :** నారాయణపేట నియోజకవర్గ పరిధిలోని ధన్వాడ, నారాయణపేట, మరియు దామరగిద్ద మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు గురువారం నూతన మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 225 మంది అంగన్‌వాడీ టీచర్లకు ఈ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శివారెడ్డి, హనుమంతు, శరణప్ప, మల్లేష్‌తో పాటు స్థానిక వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఐసిడిఎస్ విభాగం నుండి సీడీపీఓ పార్వతి, కార్యాలయ సిబ్బంది మరియు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నూతన మొబైల్ ఫోన్ల ద్వారా అంగన్‌వాడీ సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది.

# వెంకయ్య నాయుడును కలిసిన ముద్దుకృష్ణంరాజు



**నేటి సాక్షి,పుంగనూరు:** భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును పుంగనూరుకు చెందిన సీనియర్ నేత ఎం. ముద్దుకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరులోని ఎన్‌పీసీ (NPC) కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఆయనను కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ముద్దుకృష్ణంరాజు మనవడు, పుంగనూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎం. జగదీష్ రాజు కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. పాత మిత్రుడు ముద్దుకృష్ణంరాజును చాలా కాలం తర్వాత కలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా వారి మధ్య ఉన్న స్నేహాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముద్దుకృష్ణంరాజు కూడా తన స్పందనను తెలియజేస్తూ, ఆత్మీయ మిత్రుడు వెంకయ్య నాయుడుతో కలిసి మాట్లాడటం ఆనందంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సాగిన ఈ భేటీ అందరి దృష్టిని ఆకర్షించింది.

# సంసద్ ఖేల్ మహోత్సవం



**నేటి సాక్షి,నారాయణపేట:** ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవంలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ఈ క్రీడలను ప్రారంభించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఈ మహోత్సవం ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బాయికాటి రాజశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు దేవరింటి నరసింహ రెడ్డి, హనుమంతు, ఉట్కూరు భరత్ పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పీకే నరసింహ, మేరవ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కురువ లింగం మరియు ఇతర నాయకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడల నిర్వహణ పట్ల యువత హర్షం వ్యక్తం చేస్తోంది.


# కోసిగిలో వాహన తనిఖీ



**నేటి సాక్షి:** కోసిగి మండలంలో ట్రాఫిక్ నియమాల అమలును కట్టుదిట్టం చేసే దిశగా పోలీసులు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలను సీఐ మంజునాథ, ఎస్ఐ రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాహనాలను ఆపి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారు, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారు, అతివేగంగా ప్రయాణించిన వారు, అలాగే డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. తనిఖీల సమయంలో పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం తగ్గుతుందని, సీట్ బెల్ట్ వినియోగం కూడా తప్పనిసరి అని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. అతివేగం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వేగాన్ని నియంత్రించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం ప్రమాదకరమని, అలాంటి అలవాట్లను వెంటనే మానుకోవాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు తరచూ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలను పాటించడం ద్వారా మన ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని స్పష్టం చేశారు.

# ఐరన్‌గల్ యువకుడి ఘనత

## ఇన్‌కమ్ ట్యాక్స్ సూపరింటెండెంట్‌గా కరికి భీమా ఎంపిక



**నేటి సాక్షి,కోసిగి:** కోసిగి మండలం ఐరన్‌గల్ గ్రామానికి చెందిన కరికి భీమా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన SSC CGL-2026 ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఆయన ఆదాయపు పన్ను శాఖలో ఇన్‌కమ్ ట్యాక్స్ సూపరింటెండెంట్‌గా ఎంపిక కావడంపై గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కరికి శ్రీరాములు, మహాదేవి దంపతుల కుమారుడైన భీమా పట్టుదలతో శ్రమించి ఈ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భీమా మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల ప్రోత్సాహం మరియు వారు పడిన కష్టానికి ఫలితంగానే ఈ విజయం లభించిందని, దీనిని వారికే అంకితం చేస్తున్నానని తెలిపారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుండి వచ్చి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన భీమాను గ్రామస్తులు మరియు మిత్రులు ఘనంగా అభినందించారు. ఆయన విజయం మండల యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.

# రైతులు అధైర్యపడద్దు..చివరి గింజ వరకు కొంటాం



**నేటి సాక్షి తొగుట,(వడ్డే నరసింహులు):** తొగుట మండల కేంద్రం లో వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ అమర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గత నెల 21 న ప్రారంభమైన రోజు నుండి పొద్దుతిరుగుడు పంట 278 మంది రైతుల దగ్గర 7180 బస్తాలు,3590 క్వింటాలు సేకరించడం జరిగిందన్నారు. అదేవిధంగా మక్కజొన్న పంట 25 మంది రైతుల నుండి 2333 బస్తాలు, 1166.50 క్వింటాలు సేకరించడం జరిగిందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని మార్క్ ఫెడ్ డీఎం వి.సునీత తో మాట్లాడి గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని కోరారు. రైతులు ఎటువంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని సిద్దిపేట జిల్లాలోనే తొగుట మార్కెట్ పొద్దుతిరుగుడు కొనుగోలులో రెండో స్థానంలో వుందని అన్నారు. రైతులు అధైర్యపడవద్దని చివరి గింజ వరకు కొనుగోలు జరుపుతామని కొద్దిగా ఓపిక పట్టాలని రైతులను కోరారు.. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి,గౌరవ సర్పంచ్లు పాగాల శోభ కొండల్ రెడ్డి, గొడుగు జయమ్మ నర్సింలు, మార్కెట్ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు, డైరెక్టర్లు చందా సత్తయ్య, నరసింహారెడ్డి, స్వామి, ఆన్సర్, బుచ్చగౌడ్, నాయకులు మహిపాల్ రెడ్డి, మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి, రజినీకాంత్ రెడ్డి, కనకయ్య, భారత్ తేజ, తదితరులు పాల్గొన్నారు..

# మహిళఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంతకాల సేకరణ



- పేరంటల్ కేర్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్
- కోసిగి మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల నిరసన

**నేటి సాక్షి,కోసిగి:** కోసిగి మండలంలో మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ (ఖుఖీ) నాయకులు గురువారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో దాదాపు 50 శాతం మంది మహిళలే ఉన్నారని, అయినప్పటికీ వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పెద్దారెడ్డి విమర్శించారు. మండలంలోని జంపాపురం, సజ్జలగూడెం పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ.. మహిళా ఉపాధ్యాయులు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను నిర్వహించడంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల సంరక్షణ కోసం సంవత్సరానికి కనీసం 10 రోజుల 'పేరంటల్ కేర్ లీవ్' మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల సంరక్షణకు సంబంధించిన అన్ని అవసరాలకు చైల్డ్ కేర్ లీవ్‌ను (Child Care Leave) సులభంగా వినియోగించుకునేలా అనుమతించాలని వారు కోరారు. మహిళా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు మహిళా ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

# రాజంపేటలో అంగన్‌వాడీ పరిశీలన

- సదుపాయాలు, సేవలపై స్థానికులతో ఆరా
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ భరోసా




**నేటి సాక్షి,ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం స్థానిక నాయకులు సందర్శించారు. కేంద్రంలోని సదుపాయాలు, చిన్నపిల్లలకు అందుతున్న పౌష్టికాహారం మరియు ఇతర సేవలను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు గులాం జావిద్, కిషోర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న లోపాలను మరియు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ బుర్రా పోచయ్య మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో వార్డు సభ్యులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# నీటి భద్రతపై అవగాహన సదస్సు



## ప్రతి నీటి బొట్టును సంరక్షించాలి. జేఈ సంజీవ్ కుమార్

**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో "నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సును జేఈ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడవచ్చని రైతులకు సూచించారు. చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రత, భూగర్భ జలాల పెంపు వంటి చర్యలు తీసుకోవడం ద్వారా సాగునీటి సమస్యలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, సాగునీటి సంఘాల ద్వారా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఖాదర్ బాషా కూడా పాల్గొని కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. స్థానిక రైతులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

# ప్రదీప్ రెడ్డి పరామర్శ

## రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేత

**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండలంలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బోయ కడబూరి రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి గురువారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రమాదం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కేపీ యల్లప్ప పాల్గొని బోయ కడబూరికి ధైర్యం చెప్పారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

